

సాంకేతిక పరిజ్ఞానం జోడించాలి

పరిశోధనలకు సాంకేతిక పరిజ్ఞానం జోడించుకోవాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి సూచించారు. - 10లో



ఇళ్లు కేటాయించాలని ఆందోళన

అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని దేవరకొండ జంగాల కాలనీవాసులు ఆందోళన బాట పట్టారు. - 8లో

గరిష్టం/కనిష్టం 37°/19°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంయి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 32 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు చేస్తాం : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : ప్రతి ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు చేయడంతో పాటు లోపాయికారిగా తగిన సమాచారం సేకరించి బాధితులకు న్యాయం చేస్తేనే పోలీస్ శాఖపై నమ్మకం కలుగుతుందని ఎస్పీ అపూర్వరావు చెప్పారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె ఫిర్యాదులు తీసుకుని మాట్లాడారు. కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, శాంతి భద్రత సమస్యగా మారకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమగ్ర దర్యాప్తుతోనే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న దుగ్యాల ప్రదీప్

మిర్యాలగూడ టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బృందావన గార్డెన్‌లో నిర్వహించిన శక్తి కేంద్రాలు, సహాయ శక్తి కేంద్రాలు, విస్తారకుల వర్క్‌షాపునకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి బూత్ ఇన్‌చార్జి, సభ్యులు 30 మంది ఓటర్ల చొప్పున ఒక పన్నా ప్రముఖ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను ఇతర రాజకీయ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ పాలక్, ప్రముఖ సినీ నటి కవిత, నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేత సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, సత్యప్రసాద్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి వెంకట్‌రెడ్డి, చిలుకూరి శ్యాం, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొండేటి సరిత, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పులి విద్యాసాగర్ తదితరులున్నారు.

శివాలయంలో పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి అనుబంధంగా ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారికి రుద్ర హవనం, అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం శివ గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు నిర్వహించి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర పూజలు నిర్వహించారు.

సమ్మేళనాలకు సన్నద్ధం

- నాలుగైదు రోజుల్లో ఆత్మీయ సమ్మేళనాలు
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ
- మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో కార్యక్రమాల నిర్వహణకు రెడీ..
- జిల్లాకు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించిన కేటీఆర్
- ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కసరత్తు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. సమ్మేళనాలు నిర్వహణకు గాను జిల్లాకు ఒక ఇన్‌చార్జిని కూడా నియమించారు. నల్లగొండ జిల్లాకు మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, యాదాద్రి భువనగిరి జిల్లా యాదవరెడ్డి, సూర్యాపేట జిల్లాకు మెట్టు శ్రీనివాస్‌ను నియమించారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఆయా ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రెండు మూడు రోజుల్లో సమావేశం నిర్వహించుకొని ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించే తేదీలతో కూడిన ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు.

ముందుగా పార్టీ కార్యకర్తలతో..

పది గ్రామాలను ఒక యూనిట్‌గా చేసుకొని ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించనున్నారు. పట్టణాల్లో డివిజన్ల వారీగా నిర్వహిస్తారు. ఇందులో దళితబంధు, తదితర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ముందుగా ప్రతి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతోనే ఈ సమ్మేళనాలను నిర్వహించాలని జిల్లా నేతలు ఆలోచనలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో పార్టీ కార్యకర్తలు కూడా ఉన్నందునా మొదట వారితోనే ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆ తరువాత పార్టీ కార్యకర్తల కుటుంబాలు, ప్రజలతో నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు జిల్లా పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవం, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించేలా ప్రణాళిక చేయనున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల నేతృత్వంలోనే ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడనున్నారు.

'ఇంటింటికి బీఆర్‌ఎస్'..

ఆత్మీయ సమ్మేళనాలతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు కూడా సొంతంగా కార్యక్రమాలను సిద్ధం చేసుకుంటున్నారు. నల్లగొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఏప్రిల్ 1వ తేదీ నుంచి నియోజకవర్గంలో ఇంటింటికి బీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. 24రోజుల పాటు ఆ కార్యక్రమం కొనసాగించి, 25న నియోజకవర్గ సమావేశం, పార్టీ ప్లీనరీ అనంతరం మళ్లీ నియోజకవర్గంలోని 93 గ్రామాల్లో జెండా పండుగ పేరుతో పర్యటించాలని నిర్ణయించారు. అదే తరహాలో మిగతా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు కూడా రెడీ అవుతున్నారు.


రెండు రోజుల్లో ప్రణాళిక



సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తాం. రెండు మూడు రోజుల్లో జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తాం. అందులో కార్యక్రమాలపై చర్చిస్తాం. నాలుగైదు రోజుల్లో ఆత్మీయ సమ్మేళనాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం.

– గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి

చర్చించి నిర్ణయిస్తాం



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమావేశాల నిర్వహణకు చర్యలు చేపడతాం. మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఏయే కార్యక్రమాలను ఎప్పుడు నిర్వహించాలన్న దానిపై చర్చిస్తాం. నాలుగు పాటు కార్యక్రమాలు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తాం.

– రవీంద్రకుమార్, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు



ఆస్కార్‌పై హర్షాతిరేకాలు..

- సంబరాలు జరుపుకున్న ప్రజలు
- భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని ప్రశంసలు

రామగిరి(నల్లగొండ) : తెలుగు పాట ప్రపంచ ఖ్యాతి పొందింది. తెలుగులో ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ప్రపంచ సినిమా రంగంలో అత్యుత్తమ స్థాయి అవార్డు ఆస్కార్ దక్కింది. తెలుగు సినిమా చరిత్రలో మొట్టమొదటి సారిగా ఆస్కార్ అవార్డు రావడంతో నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు గేయ రచయితలు, గాయకులు, సంగీత దర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆర్‌ఆర్‌ఆర్ టీమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ అవార్డు తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

భావితరాలకు స్ఫూర్తిదాయకం



తెలుగు సినిమాకు ఆస్కార్ రావడం సినీ భావితరాలకు స్ఫూర్తిదాయకం. విశ్వ వేదికపై తెలుగు పాట ఆస్కారం పొందడం తెలంగాణ గేయ రచయిత చంద్రబోస్ పాత్ర ఉండడం గర్వకారణం. చిన్ననాటి నుంచి చంద్రబోస్, కీరవాణి పాటలు విన్న నాకు సినిమా రంగంలోకి రావాలనే కోరికి పుట్టింది. మాలాంటి కొత్త వారిని చంద్రబోస్ ప్రోత్సహిస్తుంటారు.

– చరణ్ అర్జున్, గాయకుడు, సంగీత దర్శకుడు

ఆస్కార్ కల నెరవేరింది



తెలుగు సినిమా ఆస్కార్ కల నెరవేరింది. రామచరణ్ ప్రతి సినిమాలో వైవిధ్యమైన పాత్రను ఎంచుకుని దానికి ప్రాణం పోస్తాడు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో కూడా రామచరణ్‌కు అలాంటి పాత్ర దక్కడం అంచనాలకు మించి నటించడంతోపాటు నాటునాటు పాటకు డ్యాన్స్‌తో ప్రాణం పోశారు. ఆస్కార్ అవార్డు రావడం, మార్చి 27న రామచరణ్ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడతాం.

– వి.శ్రీనివాస్, రామ్‌చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు, మిర్యాలగూడ

ఆస్కార్ రావడం హర్షణీయం



తెలుగు సినిమా పాటకు ఆస్కార్ అవార్డు రావడం హర్షణీయం. ఇప్పుడిప్పుడే సినిమా రంగంలో గాయకురాలిగా రాణిస్తున్నాను. ఆస్కార్ అవార్డ్ మాలాంటి వారికి స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్‌లో ఆస్కార్ అవార్డు లక్ష్యంగా పాటలు పాడుతాను.

– దామిని చింతల, బాల గాయని

గర్వించదగ్గ విషయం



తెలంగాణకు చెందిన సినీ గేయ రచయితకు సినిమా అత్యున్నత అవార్డు ఆస్కార్ రావడం గర్వించదగ్గ విషయం. చంద్రబోస్ రాసిన బాణీలు, కీరవాణి అందించిన సంగీతం సినిమా ప్రియులను మెప్పించడంతో.. తెలుగు పాటకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చింది. రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవ అద్భుతమైన గాత్రాన్ని అందించారు.

– నర్సిరెడ్డి, గేయ రచయిత, గాయకుడు

తెలుగు సినిమా స్థాయి పెరిగింది



ఆస్కార్ సాధించడంతో ఆర్‌ఆర్‌ఆర్ సినిమా చరిత్ర సృష్టించింది. ఆ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో తెలుగు సినిమా స్థాయి పెరిగింది. గాయకురాలిగా నాకు మర్చిపోలేని అనుభూతిని కలిగించింది.

– బండారం వాగ్దేవి, గాయకురాలు

ఆస్కార్ లభించడం సంతోషకరం



ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ లభించడంతో యావత్ భారతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఈ పాటలో చేసిన నృత్యంతో ఆస్కార్ లభించడం సంతోషించదగ్గ విషయం. జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ సంఘం తరుపున అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– గణేష్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు, మిర్యాలగూడ

ఆస్కార్ దక్కడం గర్వకారణం

- గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్ : తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమా నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడం తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాట రచయిత చంద్రబోస్, పాటపాడిన సిప్లిగంజ్, కాలభైరవ, సంగీతం అందించిన ఎంఎం.కీరవాణి, చిత్ర దర్శకుడు రాజమౌళి, హీరోలు జూనియర్ ఎన్టీఆర్, రామచరణ్‌కు గుత్తా శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ తదితరులు

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఇంటర్మీడియట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 8న జిల్లాస్థాయిలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు, ఇతర ఏర్పాట్లను పూర్తి చేశామని వివరించారు. విద్యార్థులు నేరుగా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అదనపు ఎస్పీ ప్రసాదరావు, ఆర్డీఓ జయ చంద్రారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రూనాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఇంటర్మీయట్ వార్షిక పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తికి జిల్లాస్థాయిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కంట్రోల్ రూం (ఫోన్ నంబర్లు 91007 57561, 76708 94785)కు ఫోన్ చేసి లేదా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (ఫోన్‌నంబర్ 98483 09004)కి నేరుగా ఫోన్ చేసి సమస్య, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. హాల్ టికెట్లు అందని వారు http//www.tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావొచ్చని సూచించారు.


మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నల్లగొండ టూటౌన్ : మహిళలు అధైర్య పడకుండా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బి.దీప్తి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మెప్మా సిబ్బందికి న్యాయపరమైన అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహహింస మీద సెక్షన్లు, వాటి ద్వారా పడే శిక్షలు తదితర వాటి గురించి వివరించారు. చదువుకుంటున్న ప్రతి మహిళా ఉద్యోగం, వ్యాపారాల్లో రాణించేందుకు శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సుచరిత మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణాచారి, ఐద్వా నాయకురాలు పాలడుగు ప్రభావతి, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దీప్తి

సాగర్‌లో తగ్గుతున్న నీరు



సాగర్ జలాశయం

- 538.50 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- యాసంగి పంటకు ఇప్పటికే 118 టీఎంసీల వాడకం
- మరో నెలపాటు కొనసాగనున్న నీటి విడుదల

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయంలో నీరు రోజురోజుకూ తగ్గుతోంది. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 538.50అడుగులు (185.2165టీఎంసీలు)గా ఉంది. గతే ఏడాది ఇదే రోజున 562.90 అడుగులు (239.1848టీఎంసీలు)గా ఉన్నది. ప్రస్తుతం యాసంగి పంటల సాగుకు ఎడమ కాల్వకు 8,896 క్యూసెక్కులు, కుడి కాల్వకు 9,453 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం కనిష్ట స్థాయి నీటిమట్టం 510.00 అడుగులు (133.00టీఎంసీలు). అంటే జలాశయంలో మరో 52 టీఎంసీల నీటిని మాత్రం వాడుకునేందుకు వీలుంటుంది. ముఖ్యంగా హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు 510.00 అడుగుల కంటే తగ్గితే.. నీటిని పంపింగ్ చేయడానికి కష్టంగా మారనుంది.

కొనసాగుతున్న నీటి విడుదల

వానాకాలం పంటల సాగు పూర్తయ్యాక ఎడమ కాల్వకు 2022 డిసెంబర్ 1న నీటిని నిలిపివేశారు. ఆ రోజు జలాశయం నీటిమట్టం 586.70అడుగులు (303.9495టీఎంసీలు)గా ఉంది. కుడి కాల్వకు నిరవధికంగా నీటిని విడుదల కొనసాగుతోంది. డిసెంబర్ నుంచి కుడి, ఎడమ కాల్వలకు ఇప్పటికే 118.733 టీఎంసీల నీటిని విడుదల చేశారు. గతేడాది యాసంగి పంటకు ఎడమకాల్వ కింద ఏప్రిల్ 17వ తేదీ వరకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కుడికాల్వ కింద పంటలు చేతికొస్తున్నాయి. కుడి కాల్వకు నీటిని నిలిపివేయాలని ఎన్‌ఎస్పీ అధికారులు ఆదేశాలు జారీ చేసినా హెడ్ రెగ్యులేటర్ ద్వారా కాకుండా విద్యుదుత్పాదన ద్వారా కాల్వకు నీటిని విడుదల చేస్తున్నారు. నేడో రేపో కేఆర్ఎంబీ సమావేశం జరుగనుంది. ఆ సమావేశంలో నిర్దిష్టమైన ఆదేశాలు జారీచేసే అవకాశాలున్నాయి.

పడిపోతున్న భూగర్భ జలమట్టం

- గతేడాది ఫిబ్రవరితో పోల్చితే కొన్ని మండలాల్లో తగ్గిన భూగర్భ జలాలు
- మాడ్గులపల్లి మండలంలో 2.23 మీటర్ల మేర తగ్గుదల



నల్లగొండ : వేసవి సమీపిస్తుండడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. 2022 ఫిబ్రవరి మాసంతో పోల్చితే ఈసారి కొన్ని మండలాల్లో అత్యధికంగా పడిపోగా.. కొన్ని మండలాల్లో గతంలో కంటే మెరుగ్గా ఉంది. మరికొన్ని మండలాల్లో అదేస్థాయిలో భూగర్భ జలాలు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ఎండలు మండుతున్నాయి. మార్చి మొదటి వారంలో ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల పైచిలుకు నమోదయ్యాయి. ఇక, ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో నీటి వాడకం పెరగడం పెరిగి భూగర్భజలాలు మరింత తగ్గే అవకాశం ఉంది.

కొన్ని చోట్ల కాస్త తగ్గుదల..

జిల్లాలోని మాడ్గులపల్లి మండలంలో గత సంవత్సరంతో పోల్చితే 2.23 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఆ తర్వాత మిర్యాలగూడలో 1.53 మీటర్ల మేర తగ్గాయి. నిడమనూరు, త్రిపురారం, తిరుమలగిరి(సాగర్), వేములపల్లి, కేతేపల్లి, నకిరేకల్, నల్లగొండ, తిప్పర్తి మండలాలో కూడా 1 నుంచి 2 మీటర్ల లోతు వరకు భూగర్భ జలాలు పడిపోయాయి. చందంపేట మండలంలో గత ఫిబ్రవరిలో 10.95 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా ప్రస్తుతం 8.95 మీటర్ల లోతులోనే ఉన్నాయి. దేవరకొండలో కూడా గతంతో పోల్చితే కాస్త మెరుగ్గానే ఉన్నాయి. గుండ్లపల్లిలో తగ్గగా గుర్రంపోడులో అదే స్థాయిలో ఉన్నాయి. కొండమల్లేపల్లిలో అర మీటర్ మేర పడిపోగా, మర్రిగూడ మండలంలో గత సంవత్సరంతో పోల్చితే మెరుగ్గానే ఉన్నాయి. నాంపల్లి మండలంలో మాత్రం కాస్త తగ్గగా నేరడుగొమ్ములో మాత్రం 1.61 మీటర్ల మేర పడిపోయాయి. పీఏ పల్లిలోనూ కాస్త తగ్గాయి. అడవిదేవులపల్లి మండలంలో గత సంవత్సరం 11.59 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా ప్రస్తుతం 11.79 మీటర్ల లోతులో ఉన్నాయి. దామరచర్ల మండలంలో కాస్త తగ్గగా పెద్దవూర, అనుముల, మండలాల్లో అదేస్థాయిలో ఉన్నాయి.

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలోని రాష్ట్రస్థాయి కాయకల్ప అధికారుల బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. వార్డుల్లోకి వెళ్లి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాల్లో కలియదిరిగి పరిశీలించారు. రికార్డులను చూశారు. వైద్యులు, సిబ్బంది పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. వారివెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వీరన్న ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

నల్లగొండ టౌన్ : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ పీఆర్సీ సిఫార్సులకు అనుగుణంగా జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచి కనీస వేతనం రూ. 19 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పోతెపాక వినోద్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు పోతె సత్యనారాయణ, భీమగాని గణేశ్, పొన్న అంజయ్య, గండమల్ల ఆశీర్వాదం, ఎండీ జహంగీర్, ఏర్పుల సైదులు, పగిడిమర్రి సర్వయ్య, రమావత్ రమేష్, ఎర్ర అరుణ, జ్యోతి, కోటయ్య, సైదులు, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన గీతకార్మికుడు మృతి


అంజయ్య మృతదేహం

కట్టంగూర్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీతకార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దుగినవెల్లి గ్రామ పంచాయితీ పరిధి తూర్పుబాయిగూడెం గ్రామానికి చెందిన మండల అంజయ్య(65) రోజువారీ మాదిరిగానే ఆదివారం సాయంత్రం తాటిచెట్టును ఎక్కేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మాణిక్యాలమ్మగూడెం ఆంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాదు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రున్ని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపటంతో హైదరాబాదుకు తరలిస్తుండగా సోమవారం మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


ఎల్లయ్య (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : గుండెపోటుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మృతిచెందాడు. మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లయ్య (45) సోమవారం ఉదయం కూలీలను ఉపాధి పనులకు తీసుకువెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చిన తర్వాత ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలని ఆందోళన

- తాళాలు పగులగొట్టి డబుల్ బెడ్రూం ఇళ్లలోకి ప్రవేశం
- అధికారులు నచ్చజెప్పినా వినని దరఖాస్తుదారులు
- ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించిన వ్యక్తిని అడ్డుకున్న పోలీసులు


డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

దేవరకొండ : అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన జంగాల కాలనీవాసులు సోమవారం ఆందోళన బాట పట్టారు. పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అన్ని విధాల అర్హులైన తాము డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పలుమార్లు అధికారులకు దరఖాస్తు చేసినప్పటికీ అనర్హులకు కేటాయించారని దరఖాస్తుదారులు ఆరోపించారు. నిరుపేదలను కాదని ఇప్పటికే సొంత ఇల్లు ఉన్న వారికి కేటాయించారని వారు పేర్కొన్నారు. పలుమార్లు సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టినప్పటికీ చివరకు తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కూలి, నాలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నామని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, లేనిపక్షంలో ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడుతామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి పెట్రోల్‌ను మీద పోసుకునేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ గోపిరాం ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో వారు వెనుదిరిగారు. తమకు న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. దాదాపు అర్హులైన 30 కుటుంబాలకు అధికారులు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ అక్కడే వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.


ఆందోళన చేస్తున్న కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ గోపిరాం, డీఎస్పీ నాగేశ్వర్‌రావు

ప్రాణం తీసిన చేపల వేట !

- చెరువులో మునిగి మత్స్యకారుడి మృతి
- వీధిన పడిన భార్య, ముగ్గురు ఆడపిల్లలు
- కనగల్ మండలం జి.యడవల్లిలో విషాదం


శ్రీను(ఫైల్)

కనగల్: జీవనోపాధికి ఉపయోగపడే చేపల వలే చివరకు ఓ మత్స్యకారుడి ప్రాణం తీసింది. కనగల్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన గంటా శ్రీను(40) మత్స్యకార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగా శ్రీను ఉదయం గ్రామ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల విసిరే క్రమంలో అది కాళ్లకు చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తు శ్రీను నీటిలో పడిపోయాడు. కొద్ది సేపటి వరకు శ్రీను కనబడకపోవడంతో తోటి జాలర్లు గమనించి తెప్పల సహాయంతో చెరువులో గాలించారు. అప్పటికే నీటిలో మునిగి శ్రీను మృతిచెందినట్లు గుర్తించారు. శ్రీను మృతదేహాన్ని జాలర్లు తెప్పల సహాయంతో ఒడ్డుకు తీసుకువచ్చారు. సంఘటన స్థలానికి ఎస్ఐ నాగేష్ పోలీసు సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య గోపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటిపెద్దను కోల్పోయి..

చెరువులో మునిగి మృతిచెందిన శ్రీనుకు భార్య గోపమ్మ, ముగ్గురు ఆడపిల్లలు సంతానం. శ్రీను కష్టం చేస్తేనే కుటుంబ జీవనం సాఫీగా సాగుతుంది. ఇంటిపెద్ద మరణంతో కుటుంబం దిక్కులేనిదైంది. 'ముగ్గురు ఆడపిల్లలతో బతుకేది ఎట్లా దేవుడా' అంటూ శ్రీను భార్య గుండెలవిసేలా రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టింది.

మెట్లబావి పరిశీలన

భువనగిరి : పట్టణ పరిధి ఖాజీమొహల్లాలోని జమాలుల్ బహార్ దర్గాను సోమవారం పురావస్తుశాఖ ఇంజనీరింగ్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాలో సమీపంలోని మెట్లబావిని కూడా పరిశీలించారు. గతంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ సందర్శించి చారిత్రక బావిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పురావస్తు శాఖ వారు సందర్శించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ ఇంజనీర్లు నర్సింగ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి, కౌన్సిలర్ పంగరెక్కలస్వామి, నాయకులు జలీల్, జబ్బార్, మొహిన్, బబ్లు ఉన్నారు.

ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకు కుట్ర

- మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్ చిత్రంలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు

భానుపురి (సూర్యాపేట) : ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అందులో భాగంగానే లిక్కర్ కేసును రాష్ట్రంలో చర్చనీయాంశంగా మార్చారని అన్నారు. ఓ కేసు విచారణలో భాగంగా సోమవారం ఆయన సూర్యాపేట కోర్టుకు హాజరయ్యారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రజలంతా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ వేసవిలో నీటి ఎద్దడిని ఎలా అధిగమించాలో, పంటలు ఎండిపోకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తదితర అంశాలపై చర్చ జరగాలని అన్నారు. లిక్కర్ స్కాంలో రామచంద్రపిళ్లై తాను కవితకు బినామీ అని చెప్పిన తర్వాత కూడా అరెస్టు చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. లిక్కర్ కేసులో కవిత భాగస్వామ్యం కావడం మహిళాలోకానికి అవమానమని అన్నారు. అవినీతికి ఎవరూ పాల్పడిన శిక్షిస్తానన్న సీఎం కేసీఆర్ కవితను ఎందుకు పార్టీ నుంచి బర్తరఫ్ చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీజేపీ ఏం చేసిందో చెప్పాలని, పార్టీ ఫిరాయింపులు, ఉప ఎన్నికలతో కాకుండా ప్రజల మనస్సులు గెలిచి అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జాతీయ రహదారులనే మోదీ ప్రభుత్వం తాము చేసినట్లుగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చకిలం రాజేశ్వర్‌రావు, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, బైరు శైలేందర్, కక్కిరేణి శ్రీను, రుద్రంగి రవి, మాణిక్యం, నరేందర్‌నాయుడు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన మాజీ ఎంపీ

చివ్వెంల(సూర్యాపేట) : 2018 ఎన్నికల సందర్భంగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌పై రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోర్టులో పరువు నష్ట దావా వేశారు. ఈ సందర్భంగా సోమవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలోని అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. పిటిషనర్ హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి ఏప్రిల్ 28కి కేసును వాయిదా వేశారు.

వేర్వేరు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్ట్

- మూడు తులాల బంగారు గొలుసు, నాలుగు బైకులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి : వేర్వేరు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితుల వివరాలు వెల్లడించారు. రామన్నపేటకు చెందిన బైరబోయిన వినయ్ మోత్కూర్‌లో ప్రైవేట్ బ్యాంక్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడి అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులను దోపిడీ చేస్తున్నాడు. ఈ క్రమంలోనే వినయ్ ఈ నెల 11న విధులు ముగించుకుని ఇంటికి వస్తూ వలిగొండ మండలం వేములకొండ గ్రామ శివారు లక్ష్మాపురం రోడ్డులో ఒంటరిగా వెళ్తున్న మహిళను గుర్తించాడు. వెంటనే ఆమె వద్దకు వెళ్లి మెడలోని రెండు వరుసల బంగారు పుస్తెల తాడు లాక్కొని వరంపైకి నెట్టివేసి పారిపోయాడు. మరుసటి రోజు తన స్నేహితుడు సంపత్‌తో కలిసి దానిని భువనగిరిలో అమ్ముదామని బైక్‌పై బయలుదేరారు. నాగారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి 3 తులాల పుస్తెలతాడు, బైకు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితులను పట్టుకున్న చౌటుప్పల్ సీఐ మల్లికార్జున్, వలిగొండ ఎస్సై ప్రభాకర్‌ను అభినందించారు.

మరో కేసులో బైక్ దొంగ..

బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కూడా అరెస్ట్ చేసినట్లు డీసీపీ తెలిపారు. జనగాం జిల్లాకు చెందిన బండ శ్రీకాంత్ అలియాస్ చింటు కొంతకాలంగా బైకుల చోరీకి పాల్పడుతున్నాడు. బీబీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల రెండు బైకులను అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని బీబీనగర్‌లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడు జనగాం, ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 13 కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. బీబీనగర్ పరిధిలో రెండు, హైదరాబాద్ లోనిరాజేంద్రనగర్‌లో బైకును ఎత్తుకెళ్లాడు. నిందితుడి నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి సీఐ వెంకటయ్య,, ఎస్సై సైదులు, సిబ్బంది ఉన్నారు.

బండి సంజయ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చింతపల్లి: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నేతలు చింతపల్లి ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వింజమూరి కళ్యాణ్, రామలింగం, అజార్ తదితరులున్నారు.

జాతీయ రహదారిపై బస్సు బోల్తా


అదుపు తప్పి బోల్తాపడిన బస్సు

సూర్యాపేట రూరల్: సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామ స్టేజీ వద్ద హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న బస్సు టేకుమట్ల గ్రామం వద్ద టాటాఏస్ వాహనాన్ని వెనుక నుంచి స్వల్పంగా ఢీకొట్టి కంట్రోల్ చేసే క్రమంలో రోడ్డు పక్కకు పల్టీ కొట్టింది. బస్సు పల్టీ కొట్టిన సమయంలో బస్సులో 30మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లా కొత్తపాలెం గ్రామానికి చెందిన కల్లెపోగు సుబ్బారావు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ప్రకాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న 30మందిలో ఇద్దరికి మాత్రమే గాయాలయ్యాయి. ప్రయాణికుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిరాం తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

మునగాల(కోదాడ): లారీ అదుపుతప్పి బోల్తాకొట్టింది. మునగాల శివారు హైవేపై సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ మునగాల శివారుకు రాగానే అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు ఎస్ఐ లోకేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. డ్రైవర్‌ను కోదాడ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ ప్రవేశానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం
- రాంగ్ రూట్‌లో వచ్చి స్కూటీని ఢీకొట్టిన పంచాయతీ ట్రాక్టర్
- యాదాద్రి జిల్లాలో విషాదం

యాదగిరిగుట్ట రూరల్: గృహ ప్రవేశానికి వెళ్లొస్తున్న తండ్రీకుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం రామాజీపేట వద్ద వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతంలో గల చిలకనగర్‌కు చెందిన పెద్ది రమేష్ (38) హయత్‌నగర్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇతని కుమారుడు పెద్ది అభిషేక్ (14) ఉప్పల్ జెడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇతనితో పాటు రమేష్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

తిరిగి వస్తూ అనంతలోకాలకు..

రమేష్ కుటుంబ సభ్యులంతా వారం రోజుల క్రితం వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గం నల్లబెల్లిలో ఉంటున్న తమ అత్తవారింట్లో జరుగుతున్న గృహప్రవేశానికి వెళ్లారు. శుభకార్యం ముగిసిన తర్వాత రమేష్ తన కుమారుడు అభిషేక్‌తో కలిసి స్కూటీపై సోమవారం ఉదయం చిలకనగర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం రామాజీపేట వద్దకు రాగానే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ రాంగ్ రూట్లో వచ్చి వీరి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో అభిషేక్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందగా, రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదంలో తండ్రీకుమారుడు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

బస్తీ దవాఖానాలతో మెరుగైన వైద్యం

భువనగిరి : సర్కారు వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరిలోని సంజీవనగర్, బ్రాహ్మణవాడ, తారాకరామానగర్ ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను సోమవారం అదనపు కలెక్టర్ దీపక్‌తివారీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో వైద్యం కోసం ప్రజలు చాలా దూరం వెళ్లాల్సి వచ్చేదని, బస్తీ దవాఖానాల ఏర్పాటుతో ఆ ఇబ్బందులు తప్పనున్నాయన్నారు. ఈ ఆస్పత్రుల్లో అన్ని రకాల ఓపీ సేవలతో పాటు పరీక్షలు నిర్వహించి 108 రకాల మందులు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. అనంతరం ఆయన బస్తీ దవాఖానాలో పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య పాల్గొన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి డిమాండ్

వలిగొండ : మండలంలోని వివిధ గ్రామాల గుండా వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వర్కట్‌పల్లిలో భూ సర్వేకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రైతులతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నోటీసులు జారీ చేయకుండా సర్వే చేయడం ఏంటని ప్రశ్నించారు. బడా బాబుల భూములను పరిరక్షించేందుకే రెండవసారి అలైన్‌మెంట్ మార్చారని ఆయన ఆరోపించారు. మారిన అలైన్‌మెంట్‌తో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వెంటనే ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వర్కట్‌పల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న మీసాల పరమేష, సంగంలో మంద నర్సింహ పరామర్శించి, కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగేల్లి సుధాకర్, కొప్పుల యాదిరెడ్డి, కనతాల అశోక్‌రెడ్డి, లింగ స్వామి, తానీషా, నాగెల్లి సత్యనారాయణ, వెంకటయ్య, ధనమ్మ,కమలమ్మ,పద్మ, కృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.



వర్కట్‌పల్లిలో రెవెన్యూ అధికారులను అడ్డుకుంటున్న గూడూరు నారాయణరెడ్డి తదితరులు